


ఆదోని లలిత

సంధ్యవేళ గాంధీ పార్కు మధ్యలో వున్న బాపూజీ విగ్రహం బోసి నవ్వులొలికిస్తోంది. పార్కు ప్రహరీ గోడ నానుకుని లోపల మూడడుగుల వెడల్పున ఉదయం, సాయం కాలం నడిచే వాళ్ళకు చిన్న బాటతో పార్కు నాలుగు భాగాలుగా ఉంటుంది. ఒక భాగంలో పిల్లల ప్లే గ్రౌండు, రెండవ భాగంలో జిమ్‌కు సంబంధించిన సరంజామా, మూడవ భాగంలో క్యాంటిన్ వుంటాయి. నాలుగవ భాగం ఎటు చూసినా అందమైన పూల మొక్కలతో, రంగు రంగుల ఫౌంటెన్‌లతో, కూర్చోటానికి అనువైన సిమెంటు బెంచీలతో, అక్కడక్కడ నీడ నిచ్చే పెద్ద చెట్లతో వుంటుంది. నాలుగు భాగాల మధ్యన బాపూజీ విగ్రహం, బాపూజీ విగ్రహం నుండి నాలుగు వేపులకు నాలుగు చిన్న బాటలుంటాయి.

ఆ రోజు సాయంకాలం మామూలుగా ఆ పార్కు చాలా సందడిగా వుంది. గాంధీ విగ్రహానికి కొంత దూరంలో చెట్టు క్రింద బక్క చిక్కిన అరవై ఏళ్ళ ప్రాణి, మాసిన బట్టలతో, తైల సంస్కారం లేని చింపిరి జుట్టుతో, నొసటి పై తగిలిన చిన్న గాయంతో పడున్నాడు. అటువేపు వెళుతున్న చాలా మందిలో కొందరు అతన్ని గమనించకుండానే వెళుతున్నారు. కొందరు చూసీ చూడనట్టు వెళుతున్నారు. ఎవరి హడావిడివారిది. ఎవరూ పట్టించుకోనందుకు బాపూజీ విగ్రహం అతని వేపు జాలిగా చూస్తున్నట్టుగా ఉంది. అంతలో ప్లే గ్రౌండు వేపు మూడేళ్ళ పిల్లవానితో వెళుతున్న జంటలో, ఆమె ఆదృశ్యాన్ని చూసి ముందుకు వెళుతున్న భర్తను ఆపి

"అటు చూడండి. పాపం! అన్‌కాన్సియస్‌గా పడిపోయినట్టున్నాడు. రండి చూద్దాం" అంటూ. ఆ మాట అంటున్న ఆమెను అతను అక్కడి నుండి లాక్కుని వెళ్ళినంత పని చేశాడు ముందుకు.

"అదేంటండీ!" అంది ఆమె అతని చర్యకు.

"ఇలాంటివి మనం పట్టించుకో కూడదు. వాడు తప్ప తాగి పడిపోయుంటాడు. రా! రా!" అంటూ ఆమె చేయి పట్టుకుని ముందుకు సాగాడు. ఆమె జాలి పడి ఏదో సహాయం చేస్తుందన్న ఆశ బాపూజీ కనులలో తళుక్కుమని ఆరిపోయింది అతని చర్యతో నిరాశగా. మరికొంతసేపు గడిచిపోయింది. క్యాంటిన్ వేపు వెళుతున్న ఇద్దరు స్నేహితులలో ఒకడు ఆదృశ్యాన్ని చూసి, మరొకనితో,

"అరె! అటు చూడు. ఎవరో పడిపోయారు. రా! చూద్దాం. ఏదయినా హెల్ప్ చేయగలమేమో!" అని అటు వెళ్ళబోయాడు. రెండవ అతను స్నేహితుని మాట విని అటు తిరిగి చూసి వెంటనే స్నేహితుని వెనక్కులాగి.


"మనకెందుకురా! వెళ్ళి చూసి లేనిపోని ప్రాబ్లమ్ తెచ్చుకోటం. వాడు తాగి పడిపోయాడో, లేక ఎవరయినా విరోధులు చావబాది ఇక్కడ పడేసి వెళ్ళారో మనకేం తెలుసు. ఆ నొసటి మీద గాయం, రక్తం మరకలు చూడు. మనం కలగ చేసుకుని హెల్ప్ చేయబోయి వాడికేదయినా జరిగితే పోలీసులు ప్రశ్నలతో మన ప్రాణం తీస్తారు. పద పద!" అంటూ వెనక్కు క్యాంటిన్ వేపు లాక్కెళ్ళాడు. విగ్రహంలోని బాపూ ఆత్మ నిట్టూర్చింది విచారంగా, అతనికి సహాయం అందనందుకు.

తరువాత, ఫయిల్‌మాన్ లాంటి దృఢకాయుడు జిమ్ వేపు వెళుతూ అతన్ని చూసి మెల్లగా సమీపించి నలు వేపుల చూశాడు. తరువాత ఏదో సహాయం చేయబోయినట్టు ముందుకు వంగి అతని జేబులు తడిమి చూసి "వెధవ పీనుగ. జేబులో ఏమి లేదు" అని మనస్సులో అనుకుంటూ వెళ్ళిపోయాడు. అతను చూపించిన ఔదార్యానికి బాపూ ఆత్మ ఆశ్చర్యపోయింది.

మరో అయిదు నిముషాలు గడిచిపోయాయి. రామయ్య అనే నడి వయస్కుడు అతణ్ని చూసి ఆగిపోయాడు. కంగారుగా అతన్ని సమీపించి ముక్కు దగ్గర చేయి పెట్టి చూశాడు. ఊపిరాడుతోంది. రామయ్యకు ఏం చేయాలో పాలుపోలేదు. దగ్గరలోనే గవర్నమెంటు హాస్పిటలుంది. కాని అక్కడికి తీసికెళ్ళడమెలా? వెంటనే బయటికి పరిగెత్తాడు. గేటుకవతల పార్కింగు ప్లేసులో కారొకటి కదల బోతోంది. పరుగున వెళ్ళి ఆ కారు నడుపుతున్న మనిషికి విషయాన్ని చెప్పి హాస్పిటల్‌కు తీసికెళ్ళటానికి సహాయం చేయమన్నాడు. కారులోని సూటు మనిషి రామయ్యను మింగేట్టు చూసి కనీసం బదులు పలకకుండా కారు స్టార్టు చేశాడు. రామయ్య నిరాశగా ప్రక్క నున్న ఆటో స్టాండు వైపు పరుగిడి అక్కడున్న ఆటో డ్రయివరును బ్రతిమాలాడు. ఆటో డ్రయివరు రామయ్యను ఎగాదిగా చూసి "డబ్బులున్నాయా?" అని అడిగాడు. రామయ్య జేబులో రెండు రూపాయల చిల్లర కంటే ఎక్కువ లేదు. అదే సంగతి చెప్పాడు. ఆటో డ్రయివరు, రామయ్యను చూసి వెకిలిగా నవ్వి ఎవరో పాసింజరు రావటంతో అతన్ని ఎక్కించుకుని బయలుదేరాడు. కొంచం దూరంలో టీ కొట్టు దగ్గర, టీ తాగుతున్న రిక్షావాడు రామయ్య కారు దగ్గరికి, ఆటో దగ్గరికి పరుగులు తీయటం, ఏదో అడగటం గమనించి, ఏదో విషయం ఉందని టీ తాగటం ముగించి రిక్షాతో రామయ్య దగ్గరికి వచ్చి.

"ఏందయింది బాబయ్యా! ఆళ్ళనేంది అడుగుతున్నావు?" అని అడిగాడు. రామయ్య విషయం చెప్పాడు, ఆశగా అతని వేపు చూస్తూ. రిక్షావాడు వెంటనే

"అంతేనా! నే ఇంకా ఎందో అనుకుంటి. పద నా బండిలో ఆసుపత్రికి తీసుకపోదాం." అని పార్కు వేపు దారి తీశాడు. రామయ్య సంబరపడిపోయాడు, అతను సహాయం చేస్తున్నందుకు. ఇద్దరూ పార్కులో అడుగుపెట్టారు. ఆ దేహం చుట్టూ కాకులు గోల గోలగా, కావ్ కావ్‌మని అరుస్తున్నాయి. రామయ్యకు ఏం జరిగిందో అర్థం కాలేదు. రిక్షావాడు కూడా అర్థం కానట్టు రామయ్య వేపు చూశాడు. ఇద్దరూ సమీపించి చూడగా అక్కడ చెట్టు క్రింద ఒక కాకి నిర్జీవంగా అతని దేహం ప్రక్కనే పడుంది. కాకుల గుంపు ఆ నిర్జీవంగా పడ్డ కాకి చుట్టూ చేరి కావ్ కావ్ మని అరుస్తున్నాయి. అది వాటి భాషలో బాధతో ఆర్తనాదం చేయుటమేమో? అంతలో ఆ గుంపులోని ఒక కాకి, ఆ నిర్జీవంగా పడిపోయిన కాకిని తన ముక్కుతో ప్రక్కకు లాగుతోంది. మిగతా కాకులు అరుస్తున్నాయి. ఆ దృశ్యాన్ని చూసిన రామయ్య నేత్రాలు సజలమయ్యాయి. "వాటికున్న జాతి మరులు మానవునికి లేదా? ఆ దేహం ఎంత సేపటి నుంచో అక్కడ పడుంది. కొందరువారి



హడావిడిలో చూడకుండా, మరి కొందరు చూసి చూడనట్టు పట్టించుకోకుండా వెళ్ళిపోయారు. తను వెళ్ళి బతిమాలుకున్న వాళ్ళుకూడా సహాయానికి రాలేదు" అని అనుకున్నాడు మనసులో. రిక్షావాడు కూడా ఆదృశ్యాన్ని చూసి.

"మనకంటే అయే మేలు బాబయ్యా! ఆటికి జాతి మరులు జాస్తి" అని

"రండి రండి బాబయ్యా! సీకటి పడ బోద్ది." అని తను కాళ్ళ వేపు రామయ్య తలవేపు పట్టుకుని రిక్షాదగ్గరికి తీసికెళ్ళి రామయ్య రిక్షాలో కూచోగా, రిక్షావాడు అతి కష్టం మీద అతన్ని రామయ్య ప్రక్కకు చేర్చాడు. రామయ్య అతన్ని జాగ్రత్తగా పట్టుకుని కూర్చున్నాడు. రిక్షా హాస్పిటల్ వేపు బయలుదేరింది.

ఆ దృశ్యాన్నంతా చూస్తున్న బాపూజీ విగ్రహంలోని బాపూ కనుల నుండి రెండు చుక్కలు ఆనంద భాష్పాలు రాలాయి, మానవత పూర్తిగా అడుగంటిపోనందుకు,

స్వార్థపు చీకట్లో పరుగెడుతున్న మానవుల జీవన సరళిలో మానవత ఇంకా అక్కడక్కడ మిణుకు మిణుకు మంటున్నందుకు. ✻

